సాక్షి
తిరుపతి
ఆదివారం । 18 । మే । 2025



శ్రీకృష్ణ నగర్‌లో భారీ చోరీ

శ్రీకృష్ణనగర్‌లోని రిటైర్డ్ ప్రొఫెసర్ పుల్లారెడ్డి ఇంటిలో తలుపులు పగులగొట్టి బంగారు, వెండి నగలను దోచుకెళ్లారు. - 8లో



ఎస్వీయూలోని హాస్టళ్ల తనిఖీ

ఎస్వీయూలోని విద్యార్థుల హాస్టల్ గదులను వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు శనివారం రాత్రి తనిఖీ చేశారు. - 8లో



పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ఉద్యోగులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్వో నరసింహులు పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ముక్కంటి సేవలో రక్షణశాఖ మంత్రి సలహాదారుడు



ఆలయం వద్ద సతీష్‌రెడ్డి దంపతులు

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం భారత రక్షణ శాఖ మంత్రి సాంకేతిక సలహాదారుడు, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈఓ బాపిరెడ్డి, వేదపండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

రాష్ట్రస్థాయి డ్రాయింగ్ పోటీలకు ఎంపిక



డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులతో నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : బయోలాజికల్ డైవర్సిటీ-2025 అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా శనివారం తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర బయో డైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్, పెయింటింగ్, వ్యాసరచన పోటీలకు జిల్లాలోని పలు జెడ్పీ హైస్కూల్, ఎస్పీడబ్ల్యూ డీఫార్మసీ విద్యార్థినులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలకు ఎస్పీడబ్ల్యూ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని కె.తేజస్విని ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.పద్మావతమ్మ, బయోడైవర్సిటీ బోర్డు రాష్ట్ర సమన్వయకర్త నీలకంఠయ్య అభినందించారు.

విష్ణు నివాసంలో స్కానర్



లైఫ్ ఫింగర్ ప్రింట్ ఏర్పాటు చేస్తున్న సీఐ శ్రీనివాసులు

తిరుపతి క్రైమ్ : విష్ణు నివాసంలో దొంగలను అరికట్టేందుకు ఈస్ట్ సీఐ శ్రీనివాసులు శనివారం ఫింగర్ ప్రింట్ లైవ్ స్కానర్‌ను ఏర్పాటు చేశారు. విష్ణు నివాసం కొచ్చే భక్తులను మోసగించే దొంగలను గుర్తించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వారిని పిలిపించి ఫింగర్ ప్రింట్ సేకరించడం ద్వారా వారికి నేర చరిత్ర ఉంటే బయట పడుతుందన్నారు.

భూమేత

కూటమి నేతలు భూ కుబేరులవుదామని స్కెచ్ వేశారు. ఇదే అదనుగా విలువైన భూములపై కన్నేశారు. అప్పన్నంగా దోచేయాలని పావులు కదిపారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెచ్చిపోయారు. ప్రభుత్వ భూములను ఇబ్బడిముబ్బడిగా కబ్జాచేస్తున్నారు. కుటుంబ సభ్యులు, బినామీ పేర్లపై ఎక్కించుకుని ఆ భూమి మాదే అంటూ మెలిక పెడుతున్నారు. బాస్ వెనుకున్నారని మరింత రెచ్చిపోతున్నారు. ఇది ముమ్మాటికి ఆక్రమణే అని తెలిసినా.. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూసేందుకు కూడా జంకుతున్నారు. ఇంతకీ ఈ కుబేరుల భూదందా ఎక్కడో మీరే చదవండి..!

- 194.వెంకటాపురం, ఎగువమాసాపల్లిలో భూకుంభకోణం
- 40 ఎకరాల మేర మేత బీడు, వంక భూముల ఆక్రమణ
- బినామీ పేర్లతో కాజేసిన కూటమి నేత
- బాస్ వెనకున్నారని బరితెగింపు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



ఆక్రమణకు గురైన అటవీ భూమి

సాక్షిటాస్క్‌ఫోర్స్: చిత్తూరు మండలం, అనుపల్లి నుంచి బండపల్లి, 194.వెంకటాపురం, ఎగువ మాసాపల్లి ప్రాంతం మీదుగా తచ్చూరు నేషనల్ హైవే రోడ్డు ఉంది. దీనిపక్కనే భూములకు రెక్కలొచ్చాయి. ఎకరా భూమి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలకు చేరింది. ఇదే అదనుగా భూకుబేరులు ప్రభుత్వ భూములపై కన్నేశారు. ముడుపులకు ఆశపడిన కొందరు సర్వేయర్లను రంగంలోకి దింపారు. ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయోనని గాలించారు. మేత బీడు, వంక భూములు, డీకేటీ భూములు, అటవీశాఖ భూములను వరుసగా దోచుకునేందుకు పక్కా స్కెచ్చేశారు. సర్వేయర్‌తో స్కెచ్ గీయించుకుని వీర్వోలను బుట్టలో వేసుకున్నారు. భూకుబేరుల కుటుంబీకులు, వాళ్లకు అనుకూలంగా ఉన్న వ్యక్తులను బినామీగా మలుచుకున్నారు. వాళ్లకే తెలియకుండా 25 నుంచి 30 మంది వరకు ఎకరా నుంచి రెండు ఎకరాల మేర పలు సర్వే నంబర్లలో భూములు కేటాయించారు.



ఎగువమాసాపల్లి వద్ద అటవీభూములను సర్వే చేస్తున్న మండల సర్వేయర్, సిబ్బంది

ఎగువమాసాపల్లి వద్ద ఏం చేశారంటే..

194. వెంకటాపురానికి చెందిన కూటమి నేత, భూకుబేరుడు ఒక పార్టీకి చెందిన వారే. ఇద్దరిదీ ఒకే సామాజిక వర్గం. దూరపు బంధువులు కూడా. ఈ నేపథ్యంలో 194 వెంకటాపురం వద్ద ఎందుకు భూ సమస్య అంటూ వదలిపెట్టినట్లు తెలుస్తోంది. దీంతో రూట్ మార్చుకుని ఎగువమాసాపల్లి ప్రాంతంలో 20 ఎకరాల భూములున్నాయని తెలుసుకున్నారు. అక్కడి అటవీశాఖ, డీకేటీ భూములను ఆక్రమించే పనిలో పడ్డారు. అనుచరులను రంగంలోకి దింపి జేసీబీలతో చదును చేయించారు. మూడో రోజు ముచ్చటగా ఎగువమాసాపల్లికి చెందిన కూటమి నేత, గ్రామస్తులు కలిసి అటవీశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అటవీశాఖ అధికారులు రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రెవెన్యూ అధికారులతో సర్వే చేయిస్తే అది అటవీ భూమి అని తేలింది.

బాస్ ఉన్నారనే..

అధికారం ఉంది.. బాస్(తిరుపతి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే) అండ ఉంది.. మనం ఏం చేసినా చెల్లుబాటు అవుతుందని భూకుబేరులు ప్రభుత్వ భూములను ఆక్రమించడమే పనిగా పెట్టుకుంటున్నారు. ఆక్రమిత భూముల జోలికి ఎవరు అడ్డొచ్చినా బాస్ పేరుతో బెదిరిస్తున్నారు. 'భూములు నావి కావు.. మా బాస్‌వే... మీ వల్లయ్యింది చేసుకోండి' అంటూ భూకుబేరులు బహిరంగంగా చెబుతున్నారు. మేమంతా బినామీలే.. .. టచ్ చేస్తే ఎలికాప్టర్‌లోనే దిగుతారని భయపెడుతున్నారు. కాగా ఈ భూమి పక్కాగా చేతుల్లోకి వస్తే బినామీలు ఒక్కొక్కరికీ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఇచ్చేలా డీల్ సెట్ చేశారని సమాచారం. అందుకే ఆ బినామీలు కూడా భూ కుబేరుల వెనుక బ్రహ్మాస్త్రంలా పనిచేస్తున్నారు.

ఆక్రమణలపై చర్యలేవి?

ఇక అటవీశాఖ అధికారులు ఆక్రమణదారులపై కేసు పెట్టేందుకు జంకుతున్నారు. కూటమి నేతల ఒత్తిడి ఉండడంతో అటవీశాఖ అధికారులు నోరువిప్పలేక పోతున్నారు. భూ ఆక్రమణదారులు పరారీలో ఉన్నారని సాకుచూపుతున్నారు. దీనికితోడు రెవెన్యూ అధికారులు ఆక్రమణదారుల కనుసన్నల్లో మునిగి తేలుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అందుకే భూ ఆక్రమణల జోలికి రెవెన్యూ అధికారులు వెళ్లడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆక్రమణలపై గ్రామస్తులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

194 వెంకటాపురంలో...

బండపల్లి రెవెన్యూలో తచ్చూరు రోడ్డు ఆనుకుని ఉన్న 194 వెంకటాపురంలో 30 ఎకరాల దాకా మేత బీడు ఉంది. ఇందులో 20 ఎకరాల భూమి తనదే అంటూ అదే గ్రామానికి చెందిన కూటమి నేత జేసీబీతో చదును చేశాడు. విషయం తెలుసుకున్న భూకుబేరులు తమదే భూమి అంటూ ఏకంగా మామిడి మొక్కలు పెట్టేశారు. ఈ భూ వ్యవహారంపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ మండల రెవెన్యూ అధికారులను విచారణ చేపట్టి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. నాటిన మొక్కలను తొలగించాలని హుక్కుం జారీ చేశారు. అధికారులు మామిడి మొక్కలను తొలగించి.. మేత బీడుగా ప్రభుత్వానికి నివేదికలిచ్చారు. కొన్ని నెలల తర్వాత స్థానికంగా ఉన్న నేత మళ్లీ ఆ భూమి తనదే అంటూ బోర్డు పెట్టారు. ఈ బోర్డును భూకుబేరులు కొట్టిపడేశారు. ఇది వివాదంగా మారడంతో భూకుబేరులు ఇప్పుడు రూటు మార్చారు.

సర్వేలో అటవీ భూమిగానే గుర్తించాం

ఎగువమాసాపల్లిలో ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదుపై స్పందించాం. రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నాం. జేసీబీలను సీజ్ చేయడంతో పాటు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. వారు ఇచ్చిన సమాచారం మేరకు నివేదికలు సిద్ధం చేస్తున్నాం. వీటిని సోమవారం డీఎఫ్‌కు అందిస్తాం. ఆక్రమణదారులపై తదుపరి చర్యలు ఉంటాయి. రెవెన్యూ అధికారులతో సర్వే చేయగా ఆక్రమిత భూమి అటవీ భూములని తేలింది.

–థామస్, ఎఫ్‌ఆర్‌ఓ, చిత్తూరు ఈస్ట్

కబ్జా చేశారనేది వాస్తవం

భూ ఆక్రమణపై ఫిర్యాదులొచ్చాయి. ఇప్పుడు చదును చేసిన భూమి అటవీశాఖ భూమి అని తేలింది. రెవెన్యూ భూముల విషయానికి సంబంధించి తహసీల్దార్ కూడా నోటీసులు ఇచ్చారు. తప్పు అని తేలితే తదుపరి చర్యలు తీసుకుంటాం. –శ్రీనివాసులు, ఆర్డీఓ, చిత్తూరు

ప్రభుత్వ కార్యాలయమా.. పార్టీ భవనమా!



పసుపుమయంగా ఎంపీడీఓ కార్యాలయం

నాగలాపురం: ప్రభుత్వ కార్యాలయాన్ని.. పార్టీ ఆఫీసుగా మార్చేశారు స్థానిక తెలుగు తమ్ముళ్లు.. నాగలాపురం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి పసుపు రంగు పులిమేశారు. ప్రభుత్వ కార్యాలయానికి టీడీపీ రంగు వేయడంపై ఇది ప్రభుత్వ కార్యాలయమా? పార్టీ ఆఫీసా అని విమర్శలు గుప్పిస్తున్నారు. రంగులు మార్చడానికి చేసే ఖర్చుతో అభివృద్ధి పనులు చేస్తే బాగుండేదని ప్రజలు హితవు పలుకుతున్నారు.

అధిక రక్తపోటుపై అవగాహన



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి

తిరుపతి తుడా : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ ర్యాలీ ప్రారంభించి ప్రసంగిస్తూ ఏటా సుమారు 10 లక్షల మరణాలకు అధిక రక్తపోటు కారణం అవుతోందన్నారు. ప్రధానంగా జీవన శైలి గాడి తప్పడమే దీనికి ప్రధాన కారణమన్నారు. శారీరక వ్యాయామం, మంచి పోషకాహారం తీసుకోవడం, ఆహారంలో కారం, ఉప్పు తగ్గించి తీసుకోవడం చేయాలని సూచించారు. అధిక రక్తపోటుపై అవగాహన పెంచేందుకు వైద్య నిపుణులతో సదస్సులు నిర్వహించడం ద్వారా నియంత్రించ వచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మురళి కృష్ణ, డిఐఓ ఇంచార్జ్ డాక్టర్ ఛత్ర ప్రకాష్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రెడ్డి ప్రసాద్, డాక్టర్ రూప్ కుమార్, కిరణ్ కుమార్ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములవ్వాలి

నాయుడుపేటటౌన్ : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం నాయుడు పేట పట్టణంలో కలెక్టర్ సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, , ఆర్డీఓ కిరణ్మయి, మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికతో కలిసి స్వచ్ఛాంధ్రలో భాగంగా విభిన్న కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. గోమతి సెంటర్ వద్ద కలెక్టర్ మొక్కలు నాటారు. అక్కడ నుంచి పట్టణంలోని గాంధీపార్కు వద్దకు చేరుకొని పార్కులోని చెట్ల వద్ద వేసవి కాలంలో పక్షులకు ఆహార ధాన్యాలు, మంచి నీటి వసతిని కల్పించేలా మట్టి పాత్రలను ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని పడమటి వీధి తదితర చోట్ల చలువ పందిళ్లను కలెక్టర్ పరిశీలించి అక్కడికి వచ్చిన వారికి మజ్జిగను పంపిణీ చేశారు. అనంతరం పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఎంపీడీఓ సురేష్‌బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు రాజేష్, గంగా ప్రసాద్, చెంగయ్య, ధనుంజయ పాల్గొన్నారు.



నాయుడుపేట : మజ్జిగ పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తుడాపై శ్వేతపత్రం ప్రకటించాలి

తిరుపతి తుడా : తుడాకు చెందిన ఆస్తులు, ఆదాయ వివరాలపై శ్వేతపత్రం ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు తుడా చేతిలో ఉన్న ఆస్తులు వాటి వివరాలు, ఆదాయం కేటాయింపులు గురించిన స్పష్టతను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డిమాండ్ చేశారు. అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించడంలో బాధ్యతగా వ్యవహరించలేదని ఆరోపించారు. తుడాలో నెలకొన్న పరిస్థితులపై ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి తాజా పరిస్థితులను వివరించాలని నాగరాజు డిమాండ్ చేశారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 933 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ సబ్జెక్టుల్లో పరీక్షను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 64 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రథమ సంవత్సర పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 11,196 మందికిగాను 840 మంది విద్యార్థులు గైర్హాజరవ్వడంతో 10,356 మంది పరీక్ష రాశారు. అలాగే ద్వితీయ సంవత్సర పరీక్షకు 23 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 1,473 మందికిగాను 93మంది గైర్హాజరవ్వడంతో 1,380 మంది పరీక్షను రాశారు. సప్లిమెంటరీ పరీక్షలో భాగంగా సోమవారం ఉదయం, మధ్యాహ్నం ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్ (బీపీసీ విద్యార్థులకు) పరీక్షను నిర్వహించనున్నట్లు ఆర్‌ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

మింగేస్తున్నారు!



రోజుకు రూ.8 కోట్లపైనే వ్యాపారం

- జిల్లాలో విచ్చల విడిగా మందుల వినియోగం
- సొంత వైద్యంతోనే అనారోగ్య సమస్యలు
- అతి ప్రమాదమంటున్న వైద్య నిపుణులు
- జోరుగా ఫార్మసీల వ్యాపారం.. రోజుకు కోట్లలో ఆదాయం

తిరుపతి తుడా : కడుపు మంట.. కీళ్ల నొప్పులు.. జ్వరం వచ్చినా మెడికల్ షాపును ఆశ్రయించడం అలవాటుగా మారింది. జిల్లాలో సుమారు 80 శాతం మంది ప్రజలు ప్రతి రోజూ చేస్తున్న పని ఇదే. వాట్సాప్ గ్రూప్‌లలోనూ ప్రసార మాధ్యమాలలో సెకన్లలో రోగాన్ని నయం చేసే మాత్రలు ఇవే అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రకటనలకు ప్రజలు నమ్మి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. దీంతో ప్రజల అవసరాలు, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని జిల్లాలో ఇబ్బడి ముబ్బడిగా మెడికల్ షాపులు వెలిశాయి. ఇష్టానుసారంగా వైద్యుడి సలహాలు లేకుండా మార్కెట్‌లోని మెడికల్ షాపులలో విక్రయిస్తున్న మాత్రలను వినియోగిస్తే ప్రాణాంతకమైన అనారోగ్య సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలోని ప్రధాన పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలోనూ ఇబ్బడి ముబ్బడిగా మెడికల్ షాపులు ఏర్పాటు చేశారు. ప్రజల అనారోగ్య పరిస్థితులను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ అనుమతి లేని కంపెనీలకు చెందిన మందులు, మాత్రలను విక్రయిస్తూ రోజుకు సుమారు రూ. 8 కోట్లకు పైగా దండుకుంటున్నారు. మెడికల్ షాపులో పనిచేసే ఫార్మసీ ఉద్యోగులే డాక్టర్లుగా పలానా జబ్బుకు ఈ మందులు వాడితే సరిపోతుందంటూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. డాక్టర్‌ను సంప్రదించే శక్తిలేక మందులషాపుల వారు ఇచ్చే మాత్రలు విచ్చలవిడిగా తీసుకుంటూ అనారోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు.

జిల్లా సమాచారం	
ప్రైవేటు ఆసుపత్రులు	1245
మెడికల్ షాపులు	2089
ప్రభుత్వాసుపత్రుల్లో రోజుకు మందుల ఖర్చు	రూ.4 కోట్లు
ప్రైవేటు మెడికల్ షాపుల్లో రోజుకు జరుగుతున్న వ్యాపారం	రూ.8 కోట్లు

పొద్దున్నే మింగేస్తున్నారు.

పొద్దున లేవగానే బ్రష్ చేయడం ఆలస్యం వైద్యులు సలహా లేకుండా మెడికల్ షాపు వారు ఇచ్చే మాత్రలను ప్రజలు మింగేస్తున్నారు. బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, అల్సర్, గ్యాస్ట్రిక్, కీళ్ల నొప్పులు, శ్వాసకోస సమస్యలు, గుండె జబ్బులు, తలనొప్పి, వాంతులు, జ్వరం వంటి ప్రధాన సమస్యలతో బాధపడే రోగులు రోజు రోజుకు గణనీయంగా పెరుగుతున్నారు. దీంతో జిల్లాలో వృద్ధులు, సాధారణ మధ్యవయస్కులు ప్రతి రోజు ఉదయం రెండు నుంచి ఐదు మాత్రలను తీసుకోవడం గమనార్హం. ప్రభుత్వాసుపత్రులలో ప్రధాన జబ్బులకు రోజుకు రూ. 4 కోట్లకు పైగా మందుల కోసం వెచ్చిస్తున్నా, ప్రైవేటు మందుల షాపులలో రెండు రెట్లు అధికంగా వ్యాపారం జరుగుతోంది.

యాంటీ బయాటిక్స్‌తో పొంచి ఉన్న ప్రమాదం


నొప్పి త్వరగా తగ్గాలని తపనతో పెయిన్‌కిల్లర్స్, యాంటి బయాటిక్స్‌ను ప్రైవేటు మెడికల్ షాపు సిబ్బంది ప్రజలకు సూచిస్తున్నారు. దీంతో మెడికల్ షాపు సిబ్బంది చెప్పిన ప్రకారం నొప్పి నుంచి శీఘ్ర ఉపశమనం కోసం అధిక మోతాదులో యాంటిబయాటిక్, పెయిన్‌కిల్లర్లను ప్రజలు ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆ మాత్రల వ్యాపారం జిల్లాలో మూడు పువ్వులు ఆరుకాయలుగా వెలిగిపోతోంది.

సొంత వైద్యంతో సైడ్ ఎఫెక్ట్



వైద్యుల సలహా లేకుండా సొంత వైద్యంతో ఇష్టానుసారం మందులను వాడడం వల్ల సైడ్ ఎఫెక్ట్ ఎదుర్కోక తప్పదు. మందులను అధికంగా తీసుకోవడం వల్ల భవిష్యత్తులో లివర్, కిడ్నీ, గుండె సంబంధిత సమస్యలు ఎదురవుతాయి. వైద్యుల సిఫార్సు లేకుండా మందులు కొనుగోలు చేయడం , అమ్మడం నేరం. ప్రైవేటు మందుల దుకాణాలలో వైద్యుల సలహా లేకుండా మందులు కొనుగోలు చేయడం అనారోగ్యాన్ని కొనితెచ్చుకున్నట్లే. స్వతహాగా మెడికల్ షాపునకు వెళ్లి కొనుగోలు చేసే మందులు వాడితే ఉపయోగం ఉండకపోగా ఇతర సమస్యలు తప్పవు. – డాక్టర్ బాలకృష్ణ నాయక్, డీఎంహెచ్‌ఓ, తిరుపతి జిల్లా

వాడిన మందులనే మళ్లీ వాడడం ప్రమాదం



జ్వరం, తలనొప్పి, గ్యాస్ట్రిక్ తదితర సమస్యలకు 90 శాతం మంది సొంతంగా వైద్యం చేసుకుంటున్నారు. గతంలో అనారోగ్య సమస్య ఉన్నప్పుడు ఇచ్చిన మందులను మరోసారి వైద్యులతో సంబంధం లేకుండా అదే మందులను వాడుతున్నారు. ఎక్కువ శాతం మంది చేస్తున్న పొరపాటు ఇదే. అలా వాడడం వల్ల ఇతర అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. – డాక్టర్ హరికృష్ణ, అసిస్టెంట్ ఆర్‌ఎంవో, రుయా, తిరుపతి

రిసిప్ట్ లేకుండా మందులు విక్రయించే వారిపై చర్యలు



వైద్యులు సిఫార్సు లేకుండా ఎవరైనా మందులు విక్రయిస్తే చర్యలు తప్పవు. మందులు విక్రయించాలంటే తప్పనిసరిగా వైద్యుల నుంచి రిసిప్ట్ ఉండి తీరాల్సిందే. అలా నిబంధనలు అతిక్రమించి మందులు విక్రయించే వారిపై ఫిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యకు బాధ్యులవుతారు. ముఖ్యంగా అనస్తీసియా సంబంధిత మత్తు కలిగించే మందులు, సిరప్‌లు అమ్మే వారిపై తీవ్రమైన చర్యలు ఉంటాయి. – సీహెచ్ హరిప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ కేంద్రం, తిరుపతి జిల్లా

క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో శనివారం సైనిక్, నవోదయ పోటీ పరీక్షల అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి, అపుస్మా రాష్ట్ర అకడమిక్ కోఆర్డినేటర్ వీఆర్.రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్ తదతర పోటీ పరీక్షల్లో విశ్వం విద్యార్థులు సీట్లు సాధిస్తుండడం గర్వకారణమని తెలిపారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న విశ్వం విద్యాసంస్థను అభినందించారు. విశ్వం విద్యాసంస్థ అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ గత 34 ఏళ్లుగా అనుభజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన అందిస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సంబంధించి ఉచిత సమాచారానికి 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీయూలోని హాస్టళ్ల తనిఖీ

తిరుపతి సిటీ: ఎస్వీయూలో విద్యార్థుల హాస్టల్ గదులు, బ్లాక్‌లను శనివారం రాత్రి వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, వార్డెన్లు, ప్రిన్సిపాల్ తనిఖీ చేశారు. వర్సిటీ హాస్టళ్లలో కొంతమంది అనధికారికంగా తిష్టవేసి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై గత వారం సాక్షి దినపత్రికలో ×అనధికార వసతి\ అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు తనిఖీలు చేపట్టారు. కొన్ని నెలలుగా అనధికారికంగా, విశ్వవిద్యాలయానికి డబ్బు చెల్లించకుండా విద్యార్థులు వుంటున్న గదులకు తాళం వేశారు. బయట వ్యక్తులు, రాజకీయ పార్టీలకు అనుబంధంగా చెలామణి అవుతున్న వారు ఐ బ్లాక్, ఎఫ్ బ్లాక్‌లో కొన్నేళ్లుగా వుంటున్నారు. వారిని కట్టడి చేయాలనే ఉద్దేశంతో ఆ రెండు బ్లాక్‌లను తాత్కాలికంగా మూసివేయాలని వార్డెన్లను ఆదేశించారు.

31 వరకు బీఆర్‌ఏఓయూ డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు

తిరుపతి సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలోని ఆ వర్సిటీ అధ్యయన కేంద్రం రీజనల్ కోఆర్డినేటర్ మల్లికార్జునరావు తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తించి గడువులోపు ఫీజు చెల్లించాలని కోరారు.

గఘన విజయాలు

- 55 ఏళ్లు.. 62 ప్రయోగాలు
- ఇస్రో ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు
- 99.99 శాతం సక్సెస్ రేట్
- శాస్త్రవేత్తల మొక్కవోని దీక్షకు నిదర్శనం

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఆవిర్భవించిన 55 సంవత్సరాల్లో అనేక రాకెట్ ప్రయోగాలు, ప్రయోగాత్మక ప్రయోగాలు, వాణిజ్యపరమైన ప్రయోగాలు లాంటి ఎన్నో శ్లాఘనీయమైన విజయాలను సాధించడంలో పీఎస్‌ఎల్‌వీ రాకెట్‌దే అగ్రతాంబూలం. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఆరు దశాబ్దాల చరిత్రలోకి వెళితే 1963 నవంబర్ 21 తేదీన కేరళలోని తిరువనంతపురం తుంబా ఈక్విటోరియల్ రాకెట్ కేంద్రం నుంచి అమెరికా, జపాన్, ఫ్రాన్స్, రష్యా, ఆనాటి పశ్చిమ జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న 'నైక్ అపాచి' అనే రెండు దశల సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగించారు. అనంతరం డాక్టర్ విక్రమ్ సారాబాయ్ ఆధ్వర్యంలో 1967 నవంబర్ 20న రోహిణి–75 అనే సౌండింగ్ రాకెట్‌ను పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించి విజయం సాధించారు.

ఆర్యభట్టా ఉపగ్రహాన్ని ఇక్కడే తయారు చేసి..

విక్రమ్ సారాభాయ్ ఆధ్వర్యంలో భవిష్యత్తు రాకెట్ ప్రయోగాలను దృష్టిలో పెట్టుకుని వాతావరణ పరిశోధనకు సుమారు 1161 సౌండింగ్ రాకెట్లు ప్రయోగించారు. విక్రమ్ సారాభాయ్ మరణానంతరం ప్రొఫెసర్ సతీష్ ధావన్ ఆ బాధ్యతలను తీసుకుని 1975లో మొట్ట మొదటగా ఆర్యభట్ట ఉపగ్రహాన్ని ఇక్కడే తయారు చేసుకుని రష్యా నుంచి ప్రయోగించారు. సొంతంగా రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పాటు చేసుకున్నాక వంద ప్రయోగాల మైలురాయికి చేరుకున్నారు. వంద ప్రయోగాల్లో పీఎస్‌ఎల్‌వీ రాకెట్‌లదే అగ్రస్థానం.

పీఎస్‌ఎల్‌వీ ప్రస్థానం..

శ్రీహరికోట రాకెట్ కేంద్రం పూర్తి స్థాయిలో రూపాంతరం చెందాక మొదటి ప్రయోగ వేదిక నుంచి 1979 ఆగస్టు 10న ఎస్‌ఎల్‌వీ–3 ఇ1 ఉపగ్రహం పేరుతో రాకెట్ ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. ఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో నాలుగు ప్రయోగాలు, ఏఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో నాలుగు ప్రయోగాలు చేసిన అనంతరం పోలార్ సన్ సింక్రోనస్ లాంచ్ వెహికల్ (పీఎస్‌ఎల్‌వీ) రాకెట్‌ను ఘన, ద్రవ ఇంధనాలతో కలగలసిన రాకెట్‌గా రూపొందించారు. భూమికి 505 నుంచి 730 కిలోమీటర్లు ఎత్తులోని సన్ సింక్రనస్ ఆర్బిట్‌లోకి బరువైన ఉపగ్రహాలు పంపేందుకు అధ్యయనం చేశారు. అప్పటి ఇస్రో చైర్మన్ యూఆర్‌రావు ఆధ్వర్యంలో పీఎస్‌ఎల్‌వీ రాకెట్ ప్రయోగాలకు సరైన ప్రయోగ వేదిక అవసరాన్ని గుర్తించి షార్‌లో ఒక వైపు మొదటి ప్రయోగ వేదిక (ఎంఎస్‌టీ)ని నిర్మిస్తూనే మరో వైపు పీఎస్‌ఎల్‌వీ రాకెట్‌కు అవసరమైన ద్రవ ఇంధన మోటార్ పరీక్షలను 1988 నుంచి ప్రారంభించారు. అప్పటి నుంచి 1992 దాకా అనేక పరీక్షలు నిర్వహించి పరిణితిని సాధించారు.

ఇస్రోగా అవతరించి..

స్వావలంబన, స్వయం సమృద్ధిని సాధించేందుకు ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ సంస్థను 1969లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థగా పేరు మార్పు చేశారు. రాకెట్ ప్రయోగాలకు తుంబా కేంద్రం అనువుగా లేకపోవడంతో మంచి రాకెట్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆనాటి అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్‌సారాభాయ్ అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని కోరగా ఇద్దరూ కలిసి శ్రీ హరికోట దీవి ప్రాంతాన్ని 1969లో గుర్తించారు. రాకెట్ ప్రయోగాలకు అనువుగా ఉండడంతో ఎంపిక చేశారు.



నింగి వైపునకు దూసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్న పీఎస్‌ఎల్‌వీ సీ61

60 ప్రయోగాలు విజయవంతం

44 మీటర్ల పొడవు 320 టన్నుల బరువుతో 1400 కిలోలు బరువు కలిగిన ఐఆర్‌ఎస్–1ఈ అనే ఉపగ్రహాన్ని 1993 సెప్టెంబర్ 20న మొట్ట మొదటిగా పీఎస్‌ఎల్‌వీ–డీ1 పేరుతో ప్రయోగాన్ని నిర్వహించారు. నాలుగో దశలోని ద్రవ ఇంధన దశలో సాంకేతిక లోపం ఏర్పడడంతో ఆ ప్రయోగం విఫలమైంది. ఆ తరువాత 1994 అక్టోబర్ 15 పీఎస్‌ఎల్‌వీ–డీ 2 ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇప్పటి దాకా చేసిన 62 ప్రయోగాల్లో 60 ప్రయోగాలు విజయవంతమై 99.99 శాతం సక్సెస్ రేటులో ముందంజలో ఉంది.

పీఎస్‌ఎల్‌వీ రూపకర్తలు వీరే..



నంబి నారాయణన్ శాస్త్రవేత్త | ఈకే మాధవన్ నాయర్, శాస్త్రవేత్త | ఎస్.శ్రీనివాసన్ శాస్త్రవేత్త

పీఎస్‌ఎల్‌వీ రాకెట్ తయారు చేయడానికి ఎంతో మంది ఆ నాటి యువ ఇంజినీర్లు శ్రమించినప్పటికీ ముగ్గురు శాస్త్రవేత్తలపేర్లు మాత్రం ముఖ్యంగా వినిపిస్తాయి. నంబి నారాయణన్, డాక్టర్ ఎస్.శ్రీనివాసన్, మాధవన్ నాయర్ కృషి ఫలితమేనని చెప్పొచ్చు. పీఎస్‌ఎల్‌వీ రాకెట్లకు ప్రాజెక్టు డైరెక్టర్‌గా మాధవన్ నాయర్ పనిచేశారు. ఇందులో శ్రీనివాసన్ అనే శాస్త్రవేత్త 1994లో జూన్ నుంచి అక్టోబర్ నెల దాకా అతి తక్కువ కాలం షార్ డైరెక్టర్‌గా పనిచేశారు. నంబి నారాయణన్ మాత్రం ద్రవ ఇంధనం తయారు చేసిన శాస్త్రవేత్తగా చరిత్రలో నిలిచిపోయారు. 1988లో యువ శాస్త్రవేత్తలుగా ఉన్న వీరు పీఎస్‌ఎల్‌వీ ద్రవ ఇంధన దశల మీద ఎన్నో ప్రయోగాలు చేసి విజయం సాధించారు. వీరంతా టీంగా ఏర్పడి ద్రవ ఇంధన ఇంజిన్ తయారు చేసుకుంటే భవిష్యత్తులో అత్యంత బరువైన ఉపగ్రహాలను పంపించుకునే సామర్థ్యం వస్తుందని నంబి నారాయణన్ ఆధ్వర్యంలో పారిస్‌లో శిక్షణకు వెళ్లారు. ఆయన అభివృద్ధి చేసిన ద్రవ ఇంజిన్లనే ఈ నాటికి ఫ్రెంచి గయానా కౌరూ అంతరిక్ష కేంద్రం వారు వాడుతున్నారు. ఆయన సాధించిన పురోగతితోనే ఈనాడు ద్రవ ఇంజిన్ మోటార్లుతో రాకెట్ ప్రయోగాలను చేసి ప్రపంచంలోనే ఇస్రోకు పేరు ప్రఖ్యాతులు వచ్చాయి.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం

తిరుపతి అర్బన్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ఉద్యోగులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో మూడో శనివారం సందర్భంగా స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా డీఆర్వో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో పారిశుద్ధ్యంతో పాటు పరిశుభ్రత దిశగా ఉద్యోగులు పనిచేశారు. ప్రతి కార్యాలయంలోనూ శుభ్రతతో పాటు రికార్డుల క్రమబద్ధీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇందులో ప్రతి ఉద్యోగి భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోస్‌మాండ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

'షార్'లో పార్లమెంటరీ కమిటీ బృందం

సూళ్లూరుపేట : భారత పార్లమెంట్‌కు సంబంధించి ఏడుగురుతో కూడిన పార్లమెంట్ కమిటీ సభ్యుల బృందం శనివారం సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌కు చేరుకుంది. పార్లమెంటరీ కమిటీ బృందం చేరుకోగానే ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి సాదరంగా స్వాగతం పలికారు. షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్, ప్రయోగ వేదికలను బృందం సందర్శించింది. ఆదివారం ఉదయం 5.59 గంటలకు నిర్వహించనున్న పీఎస్‌ఎల్‌వీ సీ61 ప్రయోగాన్ని కూడా మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి వీక్షించనున్నారు. ఈ కమిటీకి భువనేశ్వర్ కలితా చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. చత్తీస్‌గఢ్ ఎంపీ మహేష్ కశ్యప్, పశ్చిమ బెంగాల్ ఎంపీ అల్‌ఫ్రెడ్ కన్నగమ్, కర్ణాటకలోని బెంగళూరు ఎంపీ తేజస్వి సూర్య, అస్సాం ఎంపీ ప్రద్యూత్ బోరోడోలోయ్, ఉత్తర ప్రదేశ్ ఎంపీ జగదాంబిక పాల్, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎంపీ త్రివేంద్రర్ సింగ్ రావత్ తదితరులున్నారు.

వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన షఫీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు(ఇన్‌సెట్) షఫీ(ఫైల్)

రాపూరు : రాపూరు పట్టణానికి చెందిన వ్యక్తి మండలంలోని తాతిపల్లి వద్ద దారుణ హత్యకు గురికావడం కలకలం రేపుతోంది. రాపూరుకు చెందిన షఫీ (52) స్థానిక మూడు రోడ్ల కూడలిలో కూల్ డ్రింక్ షాపు నడుపుతున్నాడు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో షాపు మూసి వేసి ఇంటికి బయలుదేరాడు. కానీ ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే శనివారం ఉదయం రాపూరు మండలం తాతిపల్లి సమీపంలో ఒక వ్యక్తి హత్యకు గురైనట్లు స్థానికులు కండలేరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు గురైన వ్యక్తి షఫీగా నిర్ధారించారు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, సీఐ గంగాధర్, సీఐ సత్యనారాయణ, కండలేరు ఎస్ఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంను రప్పించి పరిశీలించారు. షఫీ ముఖం, మెడపైన కత్తిగాట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. హత్యకు గల కారణాలపై వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

శ్రీకృష్ణ నగర్‌లో భారీ చోరీ

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరం శ్రీకృష్ణ నగర్‌లో గుర్తుతెలియని దుండగులు భారీగా చోరీకి పాల్పడిన విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. క్రైమ్ పోలీసుల కథనం మేరకు.. ఎస్వీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ పుల్లారెడ్డి శ్రీకృష్ణ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల నాలుగో తేదీన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సొంత ఊరికి వెళ్లారు. శుక్రవారం రాత్రి ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ చేసినట్టు స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పుల్లారెడ్డికి సమాచారం అందించారు. పుల్లారెడ్డి సహకారంతో వారి ఇంట్లో పరిశీలించారు. 150 గ్రాముల బంగారు, మూడు కేజీల వెండి చోరీకి గురైనట్టు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఫింగర్ ప్రింట్లు సేకరించారు.

తిరుమల పరిశుభ్రత అందరి బాధ్యత

తిరుమల: తిరుమల పరిశుభ్రత అందరి బాధ్యత అని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమల బాలాజీ నగర్‌లో శనివారం స్వచ్ఛాంధ్ర -స్వచ్ఛ తిరుమల కార్యక్రమం నిర్వహించారు. ఆయన తిరుమల స్థానికులకు పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వారితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. తిరుమల క్షేత్రంలో పరిశుభ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో సోమన్ నారాయణ, సీపీఆర్వో డాక్టర్ టి.రవి, ఆరోగ్యాధికారి మధుసూదన్, వీజీవో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు కమిషనర్‌కు ప్రమాదం

- టైర్ పంక్చర్ కావడంతో పల్టీలు కొట్టిన కారు
- తీవ్రంగా గాయపడ్డ కమిషనర్ నరసింహ ప్రసాద్, సీసీ అమర్నాథ్‌రెడ్డి



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



చికిత్స పొందుతున్న కమిషనరు, సీసీ

పాకాల: ప్రయాణిస్తున్న కారు వెనుకటైరు పంక్చర్ కావడంతో చిత్తూరు నగర పాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్ కారు పల్టీలు కొట్టింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు శనివారం సాయంత్రం చిత్తూరు నుంచి తిరుపతి వైపు వెళుతుండగా పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై మండల పరిధిలోని గాదంకి సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో కమిషనర్‌తో పాటు సీసీ అమర్నాథ్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. కారు డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డాడు. వేగంగా వెళుతున్న కారు టైరు ఒక్కసారిగా పంక్చర్ కావడంతో కారు పల్టీలు కొట్టి మెయిన్ రోడ్డు నుంచి సర్వీసు రోడ్డుకు కారు చేరుకుంది. అదే మార్గంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళి కారులో ప్రయాణిస్తున్న ఆయన పీఏ భాను ప్రమాదాన్ని గమనించి చికిత్స నిమిత్తం ఇద్దరిని తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు.

మార్కెట్‌లోకి 'కియా కారెన్స్'



కారు ఆవిష్కరణలో డైరెక్టర్ హోషిమారెడ్డి తదితరులు

చంద్రగిరి : తిరుచానూరు సమీపంలోని హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కార్ షోరూమ్‌లో శనివారం కియా కారెన్స్ నూతన కారును ఆవిష్కరించారు. ఎండీ సి.జగన్నాథరెడ్డి, డైరెక్టర్ చెరకు నిరంజన్, సి.భారతి, సి.హోషిమారెడ్డితోపాటు ముఖ్య అతిథులు పాల్గొన్నారు. ఎండీ మాట్లాడుతూ.. కియా నుంచి విడుదలైన కియా క్లావిస్ కారులో అత్యాధునిక సదుపాయాలు ఉన్నట్లు వెల్లడించారు. రోబస్ట్ 18 హై సేఫ్టీ స్టాండర్డ్, బెస్ట్ ఇన్‌సెగ్మెంట్ 26.62 ఇంచస్ డ్యూయల్ పానోరమిక్ డిస్‌ప్లే పానెల్, డ్యూయల్ పానె పానోరమిక్ సన్‌రూఫ్, బాస్ ప్రీమియం సౌండ్ సిస్టెహవిత్ 8 స్పీకర్ అడాస్ లెవల్ 2 విత్ 20 ఆటానమస్ ఫ్యూచర్ ఉన్నట్లు వివరించారు. 8 రంగుల్లో ఈ కారు అందుబాటులో ఉందన్నారు. కారు బుకింగ్ కోసం 86888 29739 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో షోరూమ్ సీనియర్ మేనేజర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విహార యాత్రలకు ప్రత్యేక రైళ్లు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తెలుగు రాష్ట్రాల ప్రజలు వేసవి విహార యాత్రల కోసం ఈనెల 22వ తేదీ నుంచి జులై 13వ తేదీ వరకు మూడు ప్యాకేజీలుగా ప్రత్యేక రైళ్లను హైదరాబాద్ నుంచి ప్రారంభిస్తున్నట్లు శనివారం ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ కిశోర్ తెలిపారు. ప్యాకేజీ 1 కింద దివ్య దక్షిణ యాత్రతో జ్యోతిర్లింగం, అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరు ప్రాంతాలు ఉంటాయన్నారు. ఈ యాత్ర మే 22వ తేదీన ప్రారంభమై 30వ తేదీ వరకు ఉంటుందన్నారు. ప్యాకేజీ–2 కింద గంగా రామాయణ పుణ్య క్షేత్రం వరకు ఉంటుందన్నారు. ఈ యాత్రలో వారణాసి (కాశి), అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగరాజ్, శృంగవర్పూర్ ప్రాంతాలు కాగా యాత్ర జూన్ 14వ తేదీన ప్రారంభమై 22 వ తేదీ వరకు ఉంటుందన్నారు. ప్యాకేజీ–3 కింద ఐదు జ్యోతిర్లింగ దర్శన యాత్రలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగ్పూర్ ప్రాంతాలు ఉంటాయన్నారు. యాత్ర జులై 5వ తేదీన ప్రారంభమై 13వ తేదీ వరకు ఉంటుందన్నారు. టికెట్ బుకింగ్ కోసం, ఇతర వివరాల కోసం 9701360701, 9281030712, 9281030749, 9281030750, 9281030740 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

